కథా నిలయం
శ్రీకాకుళం

# ఎలుగెత్తి జైకొట్టు తెలుగోడా!

"బాబూ! ఇక్కడే ఆగండి... ఈ చీకట్లోంచి మా ఊరుని జాగ్రత్తగా చూడండి. ఎట్లా కనిపిస్తోంది? కళ్ళు తెరుస్తున్న కలలాగా లేదూ! అదుగో..ఆవులు అంబా అని అరుస్తున్నాయి. అవి ఊరుతల్లి ఆవలింతల్లాగా లేవూ! ఆ కోడికూతలు వింటున్నారా? ఆ కూతలేమిటనుకున్నారు? వేలు కొలుపులు....అవి కోళ్ళు కావు వైతాళికులు...పాపం..అలసిపోకుండా, వంశపారంపర్యంగా, యుగయుగాలుగా అవి తమ వైతాళిక ధర్మాన్ని తుచ తప్పకుండా ఆచరిస్తూనే ఉన్నాయి...ఇదో ఇదేమిటనుకున్నారు. చూట్టానికి చెరువే...కానీ, ఇది మా ఊరి పరువు...ఎందుకంటారా?

ఇది లేనప్పుడు మా ఊరివాళ్ళు పొరుగూరు వెళ్ళి పెద్ద చెరువులో నీళ్ళు తెచ్చుకునేవాళ్ళు...ఆ ఊళ్లో అందరూ గొప్పవాళ్ళే...ఆ ఊరికి పెద్దరాయుడుగారే పెత్తందారు...ఆయన ఎవరనుకున్నారు?

మా ఊరి పెత్తందారు పులిరాయుడుగారికి స్వయానా అన్నగారే. ఇద్దరూ పెద్ద జమీందారు గారి బిడ్డలు. తండ్రి ఒకరేగానీ తల్లులు వేరు... వేరు పడిన తరవాత వీరి వాటాకి ఈ ఊరు... అంటే మా ఊరు వచ్చింది... అలా తెల్లబోయి చూస్తారేమిటి? పులిరాయుడి గారి పేరు వింతగా ఉందా? ఈయనకి తండ్రిగారి వేటపిచ్చి వచ్చింది. ఒకమాటు వేట కెళ్లినప్పుడు హఠాత్తుగా మీదపడిన చిరుతపులితో కలియబడి వట్టి చేతులతో చంపేశాడు... వళ్ళంతా గాయాలై, చచ్చి బతికాడనుకోండి... అది వేరే మాట... అప్పట్నుంచీ చిన్నరాయుడి పేరు పులి రాయుడుగా మారిపోయింది.

"ఎంతసేపు అలా నిల్చుంటారు? ఇలా కూర్చోండి.... బాటసారుల కోసం ఈ చిన్న నిర్మాణాన్ని పెద్ద జమిందారు గారే కట్టించారు. ఆయన అపర కృష్ణదేవరాయలుగా

పేరుపొందాడు. ఇప్పటికీ పాతతరం వాళ్లు ఆయన గురించి కథలు చెబుతారు... కథలంటే కవిత్వం అనుకునేరు. అవన్నీ అక్షర సత్యాలు సుమండీ...

"ఇలా చూడండి... భూపాలరాగంలా ఈ ఉదయ సమీరం ఎంత ఆహ్లాద పరుస్తోందో... ఆ చిరుశబ్దాలు వింటున్నారా? చిరుచీకట్ల చాటునుంచి పెదవి విప్పకుండా పైరు పడుతుల పలకరింపులివి.

"పిచ్చివాళ్లు.... పుణ్యం కోసం, స్వర్గం కోసం మనుషులు పూజలూ యజ్ఞాలూ చేస్తారు... ఈ తెలుగు తల్లి ఒడిలో పుట్టడంకంటే పుణ్యం ఉందాండీ. ఈ నేలని మించిన స్వర్గం ఉంటుందాండీ? మనుషులు వట్టి పిచ్చివాళ్ళు. అందుబాటులో ఉన్నది మరచి, అందలం కోసం అర్రులు చాస్తారు... ఇది చేదునిజం.... వింటానికి, ఒప్పుకోవటానికీ కష్టంగా ఉంటుంది.

"బాబూ! క్షమించండి. జేగంటలా ఇంతసేపూ నేనే మాట్లాడుతున్నాను... రైలుస్టేషను బయట కలిశాం. మా ఊరికి దారి అడిగారు. నాకు చాలా సంబరమనిపించి, మా పొలిమేర దాకా పాటలు పాడాను. మిమ్మల్ని మెప్పించానో, విసిగించానో మీకే తెలియాలి... మనతో పాటు దిగిన మనుషులు వాళ్లదారిన వాళ్లు వెళ్ళే దాకా పాడాను... ఇప్పుడు మనిద్దరమే గనక, నా మనసు విప్పాను... మనసు మగువ లాంటిది బాబూ. బహు సున్నితమైనది. అందుకే అందరి ముందూ బయటపెట్టకూడదు. అపహాస్యం పాలవుతుంది.

"చెప్పండి... తమరెవరు? ఎక్కడనుంచి వస్తున్నారు? మా ఊళ్ళో మీ కెవరన్నా బంధువులున్నారా?"

ఇంతసేపూ మౌనంగా వింటున్న ఆ యువకుడు మెల్లగా నవ్వాడు. ఆ తరవాత ఇలా అన్నాడు–

"నా పేరు సూర్యప్రకాశం. పంటల వైద్యుణ్ని! తెగుళ్ళ నివారణ, అధికదిగుబడి గురించీ పూర్తి అవగాహన ఉన్నవాణ్ని. నన్ను శాస్త్రజ్ఞుడు అని కూడా అంటారు. మీ ఊళ్ళో పంటలు పాడై, అప్పుల పాలయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నందువల్ల, ప్రభుత్వం ఒక సంవత్సరకాలం మీ ఊరి రైతులకు సహాయపడమని నన్ను పంపించింది"

"అంటే తమరు గవర్నమెంటు ఉద్యోగా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును! ఇంతకీ మీ పరిచయం వదలి, ఊరి పరిచయం ఎక్కువగా చేశారు"

"నా పరిచయానికేముంది లెండి. బతుకు నేర్పులేని బడిపంతుల్ని. బతకనేర్చిన వారి చేతిలో బలిపశువుని. బాబూ.... మీరు పంటల వైద్యుడయితే, నేను అక్షరాల వైద్యుణ్ని...." నవ్వి– "నేనిలా చెప్పుకుంటే తప్పులేదుగా?" అన్నాడు.

"సరస్వతీ పుత్రులు... మీ భాషలో తప్పులా?"

"అమ్మో! గడుసువాడివే. నీ గురువెవరూ నన్ను మించిన వాడు"

"నా తల్లే నా తొలి గురువు"

"ఆహా! అయితే అచ్చమయిన సరస్వతీ పుత్రుడివి నువ్వే! నేనుకాదు... ఏమీ అనుకోకు... నిన్ను ఆత్మీయంగా నువ్వు అనే పిలవాలని పిస్తోంది..."

"ధన్యుణ్ని! డబ్బు సంపాయించగలం కానీ, ఆత్మీయత పొందగలగాలి. అందుకు తగిన అర్హత ఉండాలి అనేది మా అమ్మ. మీ లాంటి విజ్ఞులు, పెద్దల అనుగ్రహం లభించటం నా అదృష్టం"

"వినయాన్ని మించిన యోగ్యత లేదు. అహంకారాన్ని మించిన అయోగ్యత లేదు. ఇంతకీ నా పరిచయం నీకు పూర్తిగా చెయ్యలేదు. నా పేరు కోదండరామయ్య...అందరూ నన్ను కోదండం మాస్టారూ అంటారు. గౌరవం ఉన్నవాళ్ళు దండం పెడతారు. లేనివాళ్ళు మొహం చాటేస్తారు. అదుగో వేగుచుక్క చుక్కల్ని దాక్కోమని హెచ్చరిస్తోంది. సూర్యరథానికి దారి చూపిస్తోంది. బాబూ మరి కాస్సేపటిలో సూర్యుడొచ్చేస్తాడు...కానీ మా ఊరికి సూర్యుడు రాకుండానే ప్రకాశం వచ్చేసింది."

"అదెలాగ"

"నువ్వు ప్రకాశానివి కాదూ?"

"మీ చమత్కారానికి దాసోహం"

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

"బాబూ! ఇప్పుడు కాస్త జాగ్రత్తగా, శ్రద్ధగా విను... సంవత్సర కాలం మా ఊళ్ళో ఉండబోతున్నావు. పంటల్ని కాపాడబోతున్నావు... నిన్ను నువ్వు కాపాడుకోవాలంటే, మా ఊళ్ళోని ప్రధాన పాత్రలు నీకు తెలియాలి"

"చెప్పండి"

"చెప్పాగా? ఊరి జమీందారు పులిరాయుడు. కోరలు తప్ప, పంజా విప్పలేని పులి అది. పులుపు చావని ఎండు చింతచెట్టు అది. నక్కజిత్తుల చొక్కారావు పులిరాయుడి ప్రాపకంలోని మనిషి. వాడిని అందరూ నక్కారావనే పిలుస్తారు. ఊళ్ళో ఎలక్షన్లొస్తే, ఊరందరి ఓట్లూ నక్కారావే గుద్దుతాడు. ఓటర్ల వేలిముద్రలూ, సంతకాలూ చేసి, పదో పరకో పట్టుకెళ్ళటమే వాడిపని..."

"ఎంత ఘోరం!"

"ఇంకా చాలా ఘోరాలున్నాయి... అవన్నీ చెప్పేసమయం లేదు. మెల్లగా నీకే అర్థమవుతాయనుకో. నీకు కనిపించే ప్రముఖ పాత్రల్లో కుర్రతాతయ్య ఒకడు. వయస్సు 98 ఏళ్ళు. పిల్లలతో గోళీలు ఆడుతు కనిపిస్తాడు. పిల్లలు కూడా ఒరే అని పిలుస్తారతన్ని... మంత్రాలయ్య, దేవుడమ్మ మూఢనమ్మకాలకు పూజార్లు. అసలు పూజారి పేరు బుచ్చయ్య. శివాలయంలోనే కాపురం. బసవేశ్వరుడిలా బలంగా ఉంటాడు. ఊరికతనే ఘనవైద్యుడు.

చిల్లర పాత్రల్లో దండాలయ్య ఒకడు. వీడిని గుర్తుపట్టడం సులభమే. ఎవరు కనిపించినా దండం పెడతాడు...ఏమిచ్చినా పుచ్చుకొంటాడు. అలాగని బిచ్చగాడు కాదు. కేవలం బీదవాడు. ఇకపోతే కులం మీద కోపం వచ్చి ప్రేమ కోసం మతం మార్చుకున్న కరీముల్లా శివాలయంలో అష్టోత్తరం పూజలు చేయిస్తూ కనిపిస్తాడు. వాడి తమ్ముడు ఏసోబు దురాశ కొద్దీ చర్చి ఫాదరు దగ్గర కొలువు చేస్తూ పేరు మార్చుకున్నాడే గానీ, డబ్బు మీద తప్ప వాడికే దేవుడిమీదా నమ్మకం లేదు. వాడి తమ్ముడు ఎర్రోడు. ఎర్రగా ఉండీ వెర్రివాడు. వాడు రాయికీ, రప్పకీ, కనిపించిన ప్రతిదేవుడికీ మొక్కుతుంటాడు. వాడి కోరిక ఒక్కటే. వాడు ప్రేమించిన చిన్న లచ్చిమితో పెళ్లి జరగాలని..."

"పెళ్లి జరిగిందా?"

"జరిగింది. కానీ, వీడితోకాదు... దాని తల్లి పెద్ద లచ్చిమి డబ్బున్న వాడికిచ్చి పెళ్ళి చేసింది. ఇప్పుడది పిల్లల తల్లికూడా అయింది. కానీ, ఎర్రోడు ఇంకా పూజలు మానలేదు!"

"బాగుంది! ఇంకా ఎవరెవరున్నారు!"

"నువ్వు తెలుసుకోవలసిన వ్యక్తి ఒక్కరే ఉన్నారు"

"ఎవరు?"

"బంగారమ్మ"

ఉలిక్కి పడ్డాడు ప్రకాశం

"బంగారమ్మా?!"

"అవును! పులిరాయుడు తప్పనిసరై తాళికట్టిన కొండపిల్ల... ఒకమాటు.... అదే లే... ఆ పులితో కలియబడి చంపి గాయాలతో స్పృహలేకుండా పడి ఉంటే రక్షించిన కోయల నాయకుడి కూతురే బంగారు. ఆ బంగారుని తల్లినిచేసి తప్పించుకుందామని చూస్తే, గుండెలమీద బరిసెలు పెట్టి, పెళ్ళికి ఒప్పించారు. పెద్ద జమీందారు ఆ దిగులుతోనే పోయాడు... బంగారు భార్యగా దివాణానికి వచ్చింది గానీ చిన్నరాణి కాలేకపోయింది. అక్రమ సంతానంగా పుట్టిన కొడుకును పెద్ద జమీందారుకు భయపడి, పులిరాయుడు అనాథశరణాలయానికి అప్పగించాడు. అప్పట్నుంచీ బంగారు మంచం దిగలేదు. పేరుకు భార్యగా మిగిలిపోయింది. పులిరాయుడి విలాసానికి ఏ అడ్డూ లేదు. అది బాబూ మా ఊరి కథ. జమీందారు కథ వదిలేస్తే తెలుగు పల్లెటూళ్ళ కథలన్నీ పేర్ల తేడా తప్ప దాదాపు ఇలాగే ఉంటాయి తేడా వస్తేగిస్తే ఒక్కటే..."

"ఏమిటది?"

"ఎక్కడో ఒక ప్రయోజకుడు పుడతాడు. ప్రజల్లో చైతన్యం నింపుతాడు. మరిచిపోయిన మానవత్వాన్ని మరల గుర్తు చేస్తాడు. నిద్రపోతున్న వివేకాన్ని తట్టిలేపుతాడు. మనసుకు స్వేచ్ఛ నేర్పిస్తాడు. మనిషిలోని పిరికితనాన్ని పారదోలుతాడు. అలాంటి వ్యక్తి దేవదూతలాగా

ఈ మనుషుల మధ్యకు వస్తాడు... వీళ్ళని మళ్లీ వ్యక్తుల నుంచి శక్తులుగా మారుస్తాడు."

"అంటే గాంధీలాగ, నేతాజీలాగ, టంగుటూరు ప్రకాశంలాగ.."

"అవును.. అక్షరాలా అంతే!" ఉద్విగ్నంగా అన్నాడు.

"ఇప్పటి నేతలు?"

"వద్దు... వాళ్ళ గురించి చెప్పొద్దు... వాళ్ళు కొమ్మలమీద నీళ్లు చల్లి కాయలు కాయించాలని చూసే మూర్ఖులు. జాతి జీవనాడి, కూకటి వేరు పల్లెటూరని గాంధీజీ చెప్పిన పరమ సత్యాన్ని పదవుల పరగడుపులోనే పల్లార్చిన పరమ దుర్మార్గులు. వేళ్ళకు నీళ్ళు పోస్తేనే చెట్టు జీవిస్తుందని తెలియని అజ్ఞానులు... బాబూ... నువ్వు పంటల వైద్యుడి నన్నావు. నీకు చేతనయితే, చేయాలనిపిస్తే మా ఊరి మనుషుల మనసులకు పట్టిన తెగుళ్ళను వదలించు... నీ పేరుకి తగినట్లు ప్రకాశం పంచు..."

"మిణుగురు పురుగులాంటి వాడిని. నాకంత శక్తి ఉందా?"

"అణువు అతి చిన్నదే బాబూ! కానీ, అత్యంత శక్తిమంతమైనది. సంకల్పం అంటూ ఉంటే సాధించలేనిది లేదు. దానికి కృషి తోడయితే ఇక తిరుగే లేదు..."

"తెల్లవారింది... పదండి... ఊళ్ళోకి వెళదాం..."

నవ్వి "లేదు బాబూ! రాలేను" అన్నాడు...

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు...

"నేను నీకు చెప్పినట్లే ఊళ్ళో యువకులకి చెప్పాను. నక్కారావు నేను తిరుగుబాటు లేవదీయిస్తున్నానని చాడీలు చెప్పి పులిరాయుడి చేత నన్ను ఊరినుంచి వెలివేయించాడు"

"ఈ రోజుల్లో కూడా వెలి ఉందా?" తెల్లబోయాడు.

"ఈ ఊళ్లో మూఢ నమ్మకాలు, దేవదాసీలు ఉన్నప్పుడు, ప్రజల్లో పిరికితనం భూతంలా ఆవహించి ఉన్నప్పుడు, వెలి ఎందుకు ఉండదు బాబూ! వెళ్ళు... వెళ్ళి, సంవత్సరం తరవాత మళ్ళీ ఇదే రోజున ఇక్కడికి రా...నీ కోసం ఎదురుచూస్తుంటాను... నువ్వు ఊరుని మార్చావో, ఊరు నిన్ను మార్చిందో చూస్తాను... త్వరగా వెళ్ళు. మనిద్దర్నీ ఎవరన్నా చూస్తే బావుండదు...."

ప్రకాశం లేచి, ఒకసారి ఆయనకి నమస్కరించి, పులిరాయుడి గుహలోకి వెళ్తున్న సాహస వీరుడిలాగా ఊళ్ళోకి కదలివెళ్ళాడు.

కోదండం మాస్టారు నిట్టూర్చి "నా చాదస్తం అంతా తలకెక్కించాను... పాపం... చివరికేమవుతాడో..." అని తన దారి పట్టాడు.

రుతువులు మారినాయి

సూర్యుడి కోపం ప్రకృతిని కంపింపజేసింది.

మేఘుడు చల్లబడ్డాడు బద్ధకించాడు.

చలి దొంగలు విజృంభించారు...

మూసిన తలుపుల సందుల్లోంచి దూసుకుపోయి గజగజలాడించారు.

చెట్లు దీనంగా, దిగులుగా నిట్టూర్పులు విడిచాయి.

కాలదేవుడు మళ్ళీ కళ్ళు తెరిచాడు.

కోయిలలు సంబరంగా స్వాగత గీతాలు పాడాయి.

చెట్లన్నీ కొత్త పచ్చచీరలు ధరించాయి.

సూర్యుడు మళ్ళీ ఉత్సాహంగా ఉన్నాడు.

మరుగుపడిన కాంతులన్నీ మళ్లీ విజృంభించాయి

ఇప్పుడు సూర్యుణ్ని తేరి చూడాలంటే వీలుకావటంలేదు!

"మాస్టారూ!"

"ఎవరు?... బలవంతంగా కళ్లు తెరిచి చూశాడు కోదండం మాస్టారు.

"నేను... సూర్యప్రకాశాన్ని..." మొహం దగ్గరగా పెట్టాడు.

ఆ ఎండిపోయిన పెదవుల్లో జీవం వచ్చింది. ఆ గాజుకళ్ళల్లోకి వెలుగు వచ్చింది. శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్లు, లేని ఉత్సాహం కూడగట్టుకొని బలవంతంగా లేచి, దిండుకు జారగిలపడి కూర్చున్నాడు.

"నువ్వు... వచ్చావా? ఏమైంది? ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడు.

సూర్యప్రకాశం ఆనందంగా మందహాసం చేశాడు.

"అంతా మీరు ఆశించినట్టే జరిగింది!"

"అంటే... వివరంగా చెప్పు..."

"ఊళ్ళో పంటలు బాగుపడ్డాక నా మీద ఊరివాళ్ళకు విశ్వాసం, గౌరవం ఏర్పడ్డాయి. వాళ్ళ మనస్తత్వాన్ని బట్టి క్రమంగా వారిలో మార్పు రావటానికి ఓపికగా ప్రయత్నించాను. నక్కారావు నక్కజిత్తుల్ని తిప్పి కొట్టాను. ప్రజల్లోని మూఢనమ్మకాలు వదిలించాను. అందుకుగాను, అంటువ్యాధులు రాకుండా టీకాలు వేయించాను. పంటలు, అంటు వ్యాధుల భయంతోనే ప్రజలు మూఢనమ్మకాలకు లొంగుతారుకదా? ఆ అవకాశం లేకుండా చేశాను. నా కోరిక మన్నించి, ప్రభుత్వం ఊళ్ళో ప్రాథమిక వైద్య సదుపాయం వారానికొక్క మాటు ఏర్పాటు చేసింది. పులిరాయుడికి పక్షవాతం వచ్చింది. కాబట్టి, కోరలు కూడా పోయినాయి. ఇక నక్కారావుకి దిక్కులేక పనిపాటలు చేసుకు బతుకుతున్నాడు. ఊళ్ళో ఇప్పుడు అందరూ ఎలక్షన్లలో నిర్భయంగా స్వయంగా ఓట్లు వేస్తున్నారు. కాలక్షేపానికి నేను చెప్పిన చదువుతో ఇప్పుడు వేలిముద్రల వాళ్ళు లేకుండా పోయారు.... ఓటు విలువ ఏమిటో, ఎందుకు ఓటు వేయాలో వాళ్ళకి అర్థమయ్యేలా చెప్పాను. వాళ్లిప్పుడు కోటిరూపాయ లిచ్చినా ఓటు అమ్ముకోరు. ఓటే వాళ్ళ భవిష్యత్తుని నిర్ణయించే ఏకైక శక్తి

అనీ, అదే తిరుగులేని ఆయుధమనే నమ్మకం వాళ్ళల్లో స్థిరంగా ఏర్పడింది..."

"చాలు బాబూ...చాలు... ఈ మాటలు విని, ఆనందంగా చచ్చిపోవాలని, భీష్ముడు ఉత్తరాయణం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రాణాలు ఉగ్గపట్టుకున్నాను... ఇక నేను ఆనందంగా కళ్ళు మూస్తాను..."

"లేదు మాస్టారూ! మిమ్మల్ని మీ కన్నతల్లి... మీ ఊరు పిలుస్తోంది... మీ రాక కోసం ఎదురుచూస్తోంది... మిమ్మల్ని వెలివేశారన్న దిగులుతో కుంగిపోయిన పల్లె తల్లి, మిమ్మల్ని మనసారా గుండెలకు హత్తుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది... మీ ప్రేరణతో నేను చేసిన కృషిని మీకు చూపాలని తహతహలాడుతోంది..."

"అలాగా బాబూ! అయితే పద.... నా కన్నతల్లిని విడిచి నేనెలా ఉంటాను. ఆ చల్లని తల్లి ఒడిలోనే కళ్ళు మూస్తాను... మళ్లీ మళ్ళీ నీ ఒడిలోనే పుడతా తల్లీ అని మాట ఇస్తాను... నా సోదరుల్ని, నా ఊరి వాళ్ళని చివరిసారి కళ్ళారా చూస్తాను. ఎలుగెత్తి జైకొట్టు తెలుగోడా! అని గొంతు చించికుని చివరి పాట పాడతాను... పద బాబూ... పద..."

ప్రకాశం ఆయన్ను పూలదండలా చేతుల్లోకి తీసుకున్నాడు. దివ్యరథంలా ఉన్న ఎడ్లబండి లోని పరుపుల మీద పడుకోబెట్టాడు. కాలపురుషుడి హెచ్చరికలాంటి అదిలింపుతో, నందీశ్వరుడిలా వృషభేశ్వరుడు ముందుకి నడిచాడు. భవిష్యత్తు ఒడిలోకి వెళ్తున్నట్లు బండి ముందుకు కదిలింది.

పట్టెడ గంటలు సుస్వరంగా నినదిస్తున్నాయి...

"ఎలుగెత్తి జైకొట్టు తెలుగోడా
ఎద నిండ పౌరుషము గలవోడా
ఎలుగెత్తి జైకొట్టు తెలుగోడా..."

బండి వెళ్తూనే ఉంది...

గంటలు మ్రోగుతునే ఉన్నాయి!

(జాగృతి వారపత్రిక ప్రత్యేక సంచిక)